క్లుప్తంగా

సైనికుని మృతికి 'జంకె' సంతాపం

మార్కాపురం టౌన్: జమ్ము కశ్మీర్ సరిహద్దులో ఉగ్రమూకలతో వీరోచితంగా పోరాడి అమరుడైన తెలుగు జవాన్ మురళీనాయక్ వీరమరణం చెందడంపై మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ యువతకు ఆదర్శనీయమన్నారు. జవాన్ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మురళీనాయక్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. కొమరోలులోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

రాచర్ల మండలంలో..

రాచర్ల: మండలంలోని యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా యడవల్లి, సత్యవోలు, అంకిరెడ్డిపల్లె, రంగారెడ్డిపల్లె, చర్లోపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ గిద్దలూరు డీఈ బి.శేషగిరిరావు, రాచర్ల ఏఈ బాలగురవయ్య తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: ఇటీవల గాలివాన బీభత్సానికి పొలాల్లో కూలిన విద్యుత్ స్తంభాలను సరిచేశామని, అయినప్పటికీ పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ఏఈ నాగేంద్రరెడ్డి సూచించారు. తెగిపడిన వైర్లను తాకితే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పొలాల్లో ఎక్కడైనా తెగిపడిన తీగలు ఉంటే తమకు సమాచారం అందించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

రెండో విడత భూ రీసర్వే ప్రారంభం


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మార్కాపురం: మండలంలోని నరసింహాపురం, బడేఖాన్‌పేట గ్రామాల్లో 2వ దశ భూముల రీసర్వే ప్రారంభమైనట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో రీసర్వే తీరును తహసీల్దార్ పరిశీలించారు. గ్రామ పరిధిలోని పోలేరమ్మగుడి వెనుకభాగాన ఉన్న కాలనీలో గతంలో ఇచ్చిన ఇళ్ల ప్లాట్లు, గృహాలు నిర్మించకుండా ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించారు. కొందరు ప్లాట్లను విక్రయించినట్లు స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భూసారానికి పచ్చిరొట్ట పైర్ల దోహదం

అర్ధవీడు: పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూసారం పెరుగుతుందని, తద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని ఏఓ ఎస్కే మహమ్మద్ తెలిపారు. 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. విడివిడిగా, కిట్ రూపంలో విత్తనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

కొమరోలు: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ మహాలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఆసక్తి ఉన్నవారు 1బి, పట్టాదారు పాస్‌పుస్తకం, జాబ్‌కార్డుతో వీఏఏ వద్ద, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మామిడి, జామ, సపోట, బత్తాయి, నిమ్మ, మునగ తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన రమణ

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పలుగుంటిపల్లె మూలమలుపు వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన తొండమల్ల రమణ అనే వ్యక్తి తన బైక్‌పై కంభం వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో పలుగుంటిపల్లె గ్రామ సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. రమణ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌లో గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించినట్లు సమాచారం.

ప్రణాళికా లోపం.. పశువుల విలాపం!

నత్తనడకన సాగుతున్న నీటి తొట్ల నిర్మాణాలు

- నియోజకవర్గానికి 294 నీటి తొట్లు మంజూరు
- వివిధ దశల్లో ఉన్నవి 199
- కొన్నిచోట్ల ప్రారంభం కాని నిర్మాణ పనులు
- పూర్తయిన చోట నీటి సదుపాయం కల్పించని వైనం


చెట్టిచర్లలో రెండు రోజుల క్రితం నిర్మాణం ప్రారంభించిన నీటి తొట్టి

బేస్తవారిపేట:

వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న నీటి తొట్ల పనులు నత్తనడక సాగుతున్నాయి. వేసవికి ముందే వీటి నిర్మాణాలు ప్రారంభించి, పూర్తి చేసి ఉంటే మూగజీవాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. సరైన ప్రణాళిక లేకుండా గత నెల 20వ తేదీన అనుమతులిచ్చి 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు అరకొరగానే సాగుతున్నాయి. వీటిని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పచ్చ నేతలే నిర్మిస్తున్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.38 వేలు కేటాయించారు. వేసవి కావడంతో మూగజీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉండే వాగులు, కుంటలు, చెరువుల్లో నీటి వనరులు అడుగంటాయి. దీంతో గ్రామ శివార్లలో నిర్మించే నీటి తొట్లకు ప్రాధాన్యత పెరిగింది.

మండలం	మంజూరైన నీటి తొట్లు	పనులు సాగుతున్నవి	ఫిజికల్‌గా పూర్తయినవి
బేస్తవారిపేట	57	51	35
అర్ధవీడు	57	40	30
కంభం	61	33	22
గిద్దలూరు	32	19	10
కొమరోలు	29	27	16
రాచర్ల	58	29	24
తర్లుపాడు	46	38	28

పూర్తయిన నీటి తొట్టెల్లో పంచాయతీ సిబ్బంది కుళాయిలు అమర్చి, ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నీరందించాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో పూర్తయిన తొట్టెల్లో నీరు నింపకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో పనులే మొదలు పెట్టలేదు. అధికారుల ఒత్తిడి మేరకు కొన్ని చోట్ల ఇప్పుడిప్పుడే పనులు ప్రారంభించారు.


అనంపల్లెలో నిర్మాణంలో ఉన్న నీటితొట్టి

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 294 నీటి తొట్లు మంజూరయ్యాయి. వీటిలో 199 నిర్మాణ పనులు సాగుతున్నాయి. కొన్ని చోట్ల పనులు ఇంకా మొదలుపెట్టలేదు. అక్కడక్కడా నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ కుళాయి అమర్చి, ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోలేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వేసవిలోనే నీటి తొట్లు ఉపయోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తేవాలి

- మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తేవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని, అందరూ క్షేత్ర స్థాయిలో కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. శుక్రవారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తర్లుపాడు మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు నిరాశ, నిస్పృహలు వీడి ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన మేలును ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఆర్థికంగా ఉపయోగపడిన తీరు, సామాజికంగా, రాజకీయంగా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన విషయాన్ని తెలియజెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండుబాటులో ఉంటానని, ఎవరూ భయపడాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తప్పకుండా వస్తుందని, తనకు పదవి ఉన్నా లేకున్నా.. ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భవనం రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు చెన్నకేశవులు, సుజాత, పెన్నవర్ల విభాగం అధ్యక్షులు రంగారెడ్డి, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు సాదం వీరయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుమ్మా రాజేంద్రప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు జాన్‌రత్నం తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

బాలికలకు ఆత్మవిశ్వాసం అవసరం

మార్కాపురం టౌన్: విద్యార్థినులు, మహిళలు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ అధికారి రమాదేవి సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. బాలికల సమగ్ర అభివృద్ధికోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగించేసుకోవాలని సూచించారు. మహిళా పోలీసులు మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ర్యాగింగ్ చేసినా, ఇబ్బంది పెట్టినా సమాచారం అందించాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింకులకు స్పందించవద్దని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలకు వివరించారు. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అర్ధవీడు: స్థానిక మినీ అంగనివాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపరువైజర్ డి.రమీజాబీ మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, బాల్య వివాహాలను ప్రోత్సహించేవారికి విధించే శిక్షల గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం రమణమ్మ, అంగనువాడీ, ఆశా కార్యకర్తలు, వీఓఏలు, ఆయాలు పాల్గొన్నారు.

బాలిక గర్భాశయంలో 2.8 కేజీల కణితి

- ఉడుముల ఆస్పత్రిలో శస్త్ర చికిత్స విజయవంతం


బాలికకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

పొదిలి రూరల్: పొదిలిలోని ఉడుముల ఆసుపత్రిలో శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి తెలిపారు. 16 ఏళ్ల బాలిక గర్భాశయంలో 2.8 కిలోల బరువైన అండాశయ నీటిగడ్డను తొలగించినట్లు పేర్కొన్నారు. ఇటీవల తీవ్రమైన పొట్టనొప్పి, వాంతులు, పొట్ట ఉబ్బుదల తదితర సమస్యలతో ఆస్పత్రికి రాగా నీటి గడ్డ ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించామన్నారు. ఈ పరిమాణంలో ఉన్న గడ్డ చిన్న వయసులో ఏర్పడటం అరుదని చెప్పారు.

వాయుపుత్రునికి విశేష పూజలు


వివిధ రకాల పండ్ల అలంకారంలో ఆంజనేయ స్వామి వారు

మార్కాపురం: మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో శ్రీభక్తాంజనేయస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, పుష్పాలతో స్వామివారి మూల విరాట్‌ను శోభాయమానంగా అలంకరించారు. ఉదయం పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంతోపాటు చింతగుంట్ల, తిప్పాయిపాలెం, నికరంపల్లి, ఎల్‌బీయస్ నగర్, బిరుదుల నరవ తదితర గ్రామాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా సేవా సంఘం ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. రాత్రి కోలాట ప్రదర్శన, పండరి భజన భక్తులను అలరించాయి.

వేడుకగా చెన్నకేశవుని వసంతోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం, దొంగలదోపు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై అలంకరించి ఊరేగించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.


స్వామివారి గ్రామోత్సవం

అటవీశాఖ ఉద్యోగి రామానాయుడు మృతి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ పరిధిలో మండలంలోని దిగువమెట్ట గ్రామంలో ఎఫ్ఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న భూపని వెంకట రామానాయుడు(43) అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందారు. గత కొంత కాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన రాచర్ల మండలంలోని పాలకవీడు తరలించారు. మాయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామానాయుడు మృతికి అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి, రేంజ్ ఆఫీసర్లు సత్యనారాయణరెడ్డి, మధుప్రియ, వంశీకృష్ణ, అటవీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు జి.రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, కోశాధికారి చేజర్లయ్య సంతాపం తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పొదిలి రూరల్: ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన పొదిలిలోని విశ్వనాథపురం ఆంజనేయస్వామి గుడి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఆంజనేయస్వామి గుడి సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద నెమ్మదిగా వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన బస్సు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో ట్రాక్టరు ట్రక్కు పైభాగం ఊడి కింద పడింది. బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. రోడ్డు పక్కన వర్షం నీరు నిల్వ ఉండటమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి

- మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు


కంభం సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

కంభం: భారత్–పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు కోరారు. శుక్రవారం కంభం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, పోలీసు శాఖ ఏ ఆదేశాలు ఇచ్చినా వాటిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలన్నారు. దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం లాంటి చేయవద్దని హెచ్చరించారు. అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలు ఎవరూ భయపడాల్సిన పనిలేదని, జాగ్రత్తగా ఉంటూ సంయమనం పాటించి దేశభక్తిని చాటుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విస్తృతంగా వాహనాలు, లాడ్జిల తనిఖీ


మార్కాపురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణాన్ని గత రెండు రోజుల నుంచి పోలీసులు జల్లెడ పడుతున్నారు. గురువారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నుంచి హైవే రోడ్లపై సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు, అహరోన్ తదితరులు అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాడ్జిల్లో ఉన్నవారి వివరాలు సేకరించారు. పూర్తి అడ్రస్‌లు తీసుకున్న తర్వాతే లాడ్జిల్లో గదులు అద్దెకివ్వాలని, ఆధారాలు లేని వ్యక్తులకు గదులు అద్దెకు ఇవ్వవద్దని హెచ్చరించారు. బస్సుల్లో నిషేధిత వస్తువులు రవాణా చేయవద్దని స్పష్టం చేశారు.

కంభం: మండల కేంద్రమైన కంభంలోని వై జంక్షన్, కందులాపురం కూడలిలో సీఐ కె.మల్లికార్జున, ఎస్సై నరసింహారావు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో వాహనాలు, లాడ్జిల్లో తనిఖీలు ముమ్మరం చేసినట్లు సీఐ తెలిపారు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కంభంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ మల్లికార్జున

డివైడర్‌ను ఢీకొట్టిన టీఎస్ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పిన ముప్పు


డివైడర్‌ను ఢీకొని నిలిచిన బస్సు

మార్కాపురం: తెలంగాణ రాష్ట్రంలోని కోరుట్ల నుంచి పామూరు వెళ్తున్న టీఎస్ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం మార్కాపురం పట్టణ శివార్లలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. మార్కాపురం టౌన్‌లోకి వస్తున్న క్రమంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. బస్సు ఫుట్‌బోర్డు మాత్రం దెబ్బతిన్నది. ప్రయాణికులను మరో బస్సులో గమ్య స్థానాలకు పంపారు. ప్రమాదానికి కారణం డ్రైవర్ నిద్రమత్తా..! నిర్లక్ష్యమా..! అనేది తెలియాల్సి ఉంది. బస్సు మరో అడుగు మేర ముందుకు దూసుకెళ్లి ఉంటూ ముందు కూర్చున్న ప్రయాణికులకు ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అభిప్రాయపడ్డారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


మహిళల కోలాట ప్రదర్శన

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి, పోతురాజు ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. శుక్రవారం రాత్రి మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది.

ఆర్ఎస్‌కేల్లో అన్నదాత సుఖీభవ జాబితా


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకం రైతుల జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఏడీఏ డి.బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెట్టిచర్ల, జేబీకే పురంలో అన్నదాత సుఖీభవ, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట పైర్లపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ ఈనెల చివరికి పూర్తి చేస్తామన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూములు నిస్సారంగా మారాయని, పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని సూచించారు. అనంతరం పలువురు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతుల వెంకట కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయంలో చోరీ

పొదిలి రూరల్: పొదిలి మండలం ఈగలపాడు సంగమేశ్వర ఆలయంలో దొంగలు శుక్రవారం చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఎవరూ లేని సమయంలో హుండీ పగలగొట్టి సుమారు రూ.20 వేలు కాజేశారని స్థానికులు తెలిపారు.